తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice

వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

03-05-2026

ఆదివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 92

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## అర్హత లేని ఆసుపత్రికి నోటీసులు

- అర్హత లేకున్నా గర్భిణీ లకు వైద్యం అందిస్తున్నా ఆసుపత్రికి జిల్లా అధికారులు నోటీసుల జారి
- భవాని క్లినిక్ గత 20 ఏళ్లుగా తూప్రాన్ పట్టణంలో
- నిర్వహిస్తున్న అధికారులకు తెలియకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

05







## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6వేల కోట్లు చెల్లింపు
- జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులను అందిస్తాం
- ఉద్యోగ సంఘాలతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 2:**

వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధా న్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నా యకులతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని

మిగతా 2వ పేజీలో..

## ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లు

ప్రభుత్వ విప్ లతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

02

## జాబ్ కేలండర్ ఎక్కడ?

- రెండులక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి
- మేగా డీఎస్సీ దగా డీఎస్సీఏనా?
- నిరుద్యోగ భృతి ఏమైంది?
- ఉద్యోగం కోసం యువకులు లైబ్రరీల్లో చదువుతున్నారు
- వాళ్లు ఉద్యోగమే వద్దంటున్నారని ప్రచారం చేస్తారా?
- పోలీస్ శాఖలో 19 వేళ ఖాళీలు.. 5 వేల ఉద్యోగాలకే అనుమతిస్తారా?
- కాంగ్రెస్ పాలనపై మండిపడ్డ మాజీ మంత్రి హరీష్ రావు



**తెలంగాణ బ్యూరో, మే 2, :**

తెలంగాణాలో నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శిం చారు. శనివారం

## కాంగ్రెస్ కు మళ్లీ అధికారం కళ


- అడ్డూఅదుపు లేకుండా అవినీతి
- ఆ పార్టీ అరాచకాలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం
- ప్రజా వ్యతిరేక నిర్ణయాలు కొనసాగిస్తున్న బీజేపీ
- గ్యాస్ సిలిండర్ ధర రూ. వెయ్యి పెంపు ఇందులో ఒకటి
- ఉమ్మడి రంగారెడ్డి పార్టీ నేతల సమావేశంలో కేటీఆర్



02

## అవినీతి మరకలు చెరిపేనా..
# ప్రక్షాళన జరిగేనా?!

తెలంగాణ పోలీస్ బాస్‌కు వ్యవస్థాగత సవాళ్లు
ఏసీబీ చిక్కుల్లో సగం మంది పోలీసులే
శాఖకు పట్టిన అవినీతి చెదలు వదిలేనా?
ఖరీదైన పోస్టింగులకు చెక్ పెడతారా?
ఎస్ఐ నుంచి ఏసీపీ వరకు పైరవీల పర్వం..
రాజకీయ జోక్యం వర్సెస్ ప్రొఫెషనల్ పోలీసింగ్
కొత్త డీజీపీ అడుగులు ఎటువైపు?
ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలతో అట్టుడుకుతున్న రాష్ట్రం



**తెలంగాణ బ్యూరో, (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగానికి కొత్త సారథిగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరిం చారు. అయితే, ఆయనకు పూలబాట కంటే ముళ్ళబాటే ఎక్కువగా కనిపిస్తోంది. గత రెండున్నర ఏళ్లలో పోలీస్ వ్యవస్థపై వస్తున్న ఆరోపణలు, రాజకీయ జోక్యం, మరియు అదుపులేని అవినీతి వెరసి.. పోలీస్ శాఖ ప్రతిష్ట మసకబారిందన్నది నగ్న సత్యం. ప్రజా రక్షణలో ఉండాల్సిన పోలీసింగ్, అధికార పార్టీ నేతల కనుసన్నల్లో మెలుగుతుందన్న అపవాదు ను తుడిచివేయడమే కొత్త డీజీపీ ముందున్న తక్షణ కర్తవ్యం.

**ఏసీబీ ఉచ్చులో 'ఖాకీ'..**

కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో..



## ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులతో సానుకూలంగా వ్యవహరించాలి

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

03



07

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతా

- మీట్ ది ప్రెస్‌లో కవిత సంచలన వ్యాఖ్యలు

## రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి దుర్భరం

- కోర్టు జోక్యంతో రిటైర్డు ఉద్యోగుల బకాయిలపై కదలిక
- రైతుల పరిస్థితి దైన్యమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

07



## చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం

పూడికతీతతో చెరువులలో జలాశయాలు నింపాలి
చెరువుల అక్రమణలపై ఉక్కుపాదం
జూరాల, మూసీల పూడికతీతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

03





## పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

విద్య, క్రీడలు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం
ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ భవనానికి శంకుస్థాపన

03

## ఐపీఎల్ బెట్టింగ్ మోజు..

- యువత జీవితాలు చీకట్లోకి.
- సరదాగా మొదలై అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న ఆన్‌లైన్ పందేలు
- వేల నుంచి లక్షలకు చేరుతున్న బెట్టింగ్ లావాదేవీలు
- నష్టాల భారం తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్న యువత
- కట్టుదిట్టమైన నియంత్రణలతో పాటు అవగాహన కార్యక్రమాల అవసరం అంటున్న నిపుణులు

02





## ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ విధులు నిర్వహించండి

డీజీపీ సీవీ ఆనంద్
నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ అధికారులతో కీలక సమావేశం
రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు

**హైదరాబాద్, మే 2:**

ఔటర్ రింగ్ రోడ్డు పై ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ప్ర మాదాలపై సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని డీజీపీ సీవీ ఆనంద్

మిగతా 3వ పేజీలో..

## బతుకమ్మకుంట చెరువే..
## వదంతులకు హైడ్రా ఫుల్‌స్టాప్

- 1975 రికార్డులు, శాటిలైట్ చిత్రాలతో హైడ్రా స్పష్టీకరణ
- అంబర్‌పేట బతుకమ్మకుంటపై యాజమాన్య వివాదానికి కీలక మలుపు
- చెరువు భూమిపై గేట్లు, బోర్డుల తొలగింపు
- ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగిస్తామన్న కమిషనర్ రంగనాథ్

03





# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు. జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశంసించారు. వారి సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. 'ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది' అంటూ సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

# జాబ్ కేలండర్ ఎక్కడ?

**మొదటిపేజీ తరువాయి**



సిద్దిపేట లైబ్రరీలో నిరుద్యోగులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామని యువకులను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని అయన ఆరోపించారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ని అశోక్ నగర్ కు తెచ్చి అబద్దాలు చెప్పి వాటిని సైతం పత్రికల్లో ప్రకటనలు వేయించుకున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ కె దక్కుతుందన్నారు. అధికారంలోకి రాగానే మేగా డీఎస్సీ అన్న ముఖ్యమంత్రి నిరుద్యోగులను దగా చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా నేటికీ 16000 ఉద్యోగాలను మాత్రమే ప్రభుత్వం నియమించిందన్నారు.పోలీస్ శాఖలో 19 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని సాక్షాత్తు డీజీపీ చెబుతుంటే కేవలం 5 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇస్తారని అయన ప్రశ్నించారు. అలాగే గురుకుల పాఠశాలల్లో సైతం ఉద్యోగ భర్తీ జరగగడంలేదన్నారు.గ్రూప్ నోటిఫికేషన్లలో సైతం ప్రభుత్వం తాత్సారం ప్రదర్శిస్తోందన్నారు.అధికారం కోసం అబద్దాలు చెప్పి అందలం ఎక్కాక ఇప్పుడు యువకులు ఉద్యోగాలు వద్దంటున్నారని ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు.జాబ్ క్యాలెండర్ ఇప్పుడు జాబ్ లెస్ క్యాలెండరుగా మారిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెప్పిన బట్టి విక్రమార్క దీనికి ఎం సమాధానం చెబుతారని అయన ప్రశ్నించారు.ఉద్యోగాలలో వయో పరిమితి పెంచాలని అసలు ఫీజు వసూలు చేయొద్దని ప్రతిపక్షంలో పోరాటాలు చేసిన రేవంత్ ఇప్పుడు వయోపరిమితి 34కు పరిమితి చేయడం తగదన్నారు. టీఆర్ఎస్ అధికారంలో ఉండగా 10 వయో పరిమితి పెంచి నోటిఫికెషన్స్ ఇచ్చామన్నారు.యువకులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఎత్తేసి చదువుకు దూరం చేస్తున్నారని అయన ఆరోపించారు, పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలోని నిరుద్యోగులతో కలిసి అసెంబ్లీ ముట్టడిస్తామని అయన హెచ్చరించారు. ప్రభుత్వం సమస్యను తీవ్రం కాకుండా వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నిరుద్యోగ భృతి అని చెప్పి ఇప్పుడు ఏఐ వచ్చాక యువతకు ఉద్యోగాలు రావని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు.ఈ సందర్భంగా స్థానిక యువకులు ప్రభుత్వ విధానాలపై ప్లకార్డులు ప్రదర్శించారు.ఉద్యోగాల భర్తీ చేయాలని నినాదాలు చేశారు.



# ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్ లు

- ప్రభుత్వ విప్ లతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే2 :**

ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్ లే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం ఎంసిహెచ్ ఆర్డీ లో శాసనసభ, శాసనమండలి విప్ లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను విప్ లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవి నేపథ్యంలో నియోజవర్గాల్లో తాగునీరు, సాగునీటి అవసరాలకు తీసుకోవల్సిన చర్యలు, ధాన్యం సేకరణలో పురోగతి వివరాలను ముఖ్యమంత్రికి తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. విప్ లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు స్థానిక జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రభుత్వ విప్ లతో సమన్వయం చేసుకునేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారంలో ఒక రోజు విప్ లకు అందుబాటులో ఉంటానని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణరావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు.


# అవినీతి మరకలు చెరిపేనా.. ప్రక్షాళన జరిగేనా?!

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి పై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉంది. రాష్ట్రంలో ఏసీబీ దాడుల్లో పట్టుబడిన అధికారుల జాబితాను పరిశీలిస్తే, అందులో సగం కంటే ఎక్కువ మంది పోలీస్ శాఖకు చెందిన వారే ఉండటం విచారకరం. ప్రజలకు న్యాయం చేయాల్సిన అధికారులు స్వలాభం కోసం హోదాను వాడుకోవడం వల్ల శాఖకు పెద్ద మచ్చ పడింది. ఇటీవల పదవీ విరమణ చేసిన డీజీపీ కూడా ఇదే విషయాన్ని బహిరంగంగా అంగీకరించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. కొత్త పోలీస్ బాస్ ఈ అవినీతి గొలుసును ఎలా తెంచుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**రాజకీయ జోక్యం.. పోస్టింగుల పర్వం**

పరిపాలనా పరమైన బదిలీల్లో రాజకీయ జోక్యం ఉండకూడదనేది నిబంధన. కానీ తెలంగాణలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి పోలీస్ పోస్టింగులు కేవలం రాజకీయ రికమండేషన్ల ఆధారంగానే జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఎస్ఐ నుండి ఏసీపీ స్థాయి వరకు ఏ అధికారి ఎక్కడ ఉండాలనేది జిల్లా ఉన్నతాధికారి కాకుండా, స్థానిక అధికార పార్టీ నాయకులు రాసే ఉత్తరాలు నిర్ణయిస్తున్నాయి. పనితీరు ఆధారంగా కాకుండా 'పెట్టుబడి' ఆధారంగా పోస్టింగులు రావడం వల్ల, ఆ ఖర్చును రాబట్టుకునే క్రమంలోనే అధికారులు అవినీతి కూపంలోకి దిగుతున్నారని పోలీస్ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది.



**6 నెలలకే బదిలీలు.. అభద్రతలో అధికారులు**

సాధారణంగా ఒక అధికారి ఒక చోట కనీసం రెండేళ్లు పని చేసే అవకాశం ఉండాలి. కానీ, ఇప్పుడు బదిలీల కాలపరిమితి ఆరు నెలలకు కూడా గ్యారెంటీ లేని పరిస్థితి నెలకొంది. ఒక నాయకుడి సిఫార్సుతో వచ్చిన అధికారిని, మరొక నాయకుడు నచ్చలేదని మార్పించేయడం పరిపాటిగా మారింది. ఎప్పుడు బదిలీ అవుతుందో తెలియని అభద్రతా భావం వల్ల అధికారులు పూర్తి స్థాయిలో విధులపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఈ అస్థిరత కూడా అవినీతికి ఒక ప్రధాన కారణంగా మారుతోంది. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేసి అధికారుల్లో మనోధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉంది.

**ఫోన్ ట్యాపింగ్ భూతం..**

**కొత్త డీజీపీకి పెద్ద పరీక్ష!**

ప్రస్తుతం తెలంగాణ పోలీస్ శాఖను వేధిస్తున్న అతిపెద్ద సమస్య ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు. రాజకీయ నాయకుల, ప్రముఖుల ఫోన్లు అక్రమంగా ట్యాప్ అయ్యాయన్న వార్తలు ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ఈ చర్యల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? ఎంతమంది అధికారులు ఇందులో భాగస్వాములు? అనే ప్రశ్నలకు కొత్త పోలీస్ బాస్ సమాధానం వెతకాల్సి ఉంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో శాఖకు పట్టిన చెడ్డపేరును తొలగించి, పారదర్శకమైన విచారణ జరిపించడం సీవీ ఆనంద్‌కు పెద్ద పరీక్షగా మారనుంది.

**ప్రక్షాళన జరుగుతుందా?**

ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో సామాన్యుడికి చేరువవ్వాల్సిన వ్యవస్థ, ఇప్పుడు సామాన్యుడికి 'కాస్ట్లీ'గా మారిందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే పరిస్థితిని మార్చి, పోలీసుల పై విశ్వాసాన్ని పెంచేలా కొత్త డీజీపీ అడుగులు ఉండాలి. పోలీస్ శాఖను రాజకీయ ముఠాల కబంధ హస్తాల నుండి విడిపించి, చట్టం తన పని తాను చేసుకుపోయేలా స్వేచ్ఛను ప్రసాదిస్తారా? లేదా పాత పద్ధతిలోనే వ్యవస్థ కొనసాగుతుందా? అనేది కాలమే నిర్ణయించాలి. కొత్త పోలీస్ బాస్ సీవీ ఆనంద్ అనుభవం, ఆయన పనితీరుపై ఉన్న నమ్మకం దృష్ట్యా.. తెలంగాణ పోలీస్ వ్యవస్థలో ఖచ్చితంగా మార్పు వస్తుందని, అబాసుపాలవుతున్న శాఖకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని యావత్ రాష్ట్రం ఆశిస్తోంది.

# ఐపీఎల్ బెట్టింగ్ మోజు..

- యువత జీవితాలు చీకట్లోకి.
- సరదాగా మొదలై అప్పల ఊబిలోకి నెట్టేస్తున్న ఆన్‌లైన్ పందేలు
- వేల నుంచి లక్షలకు చేరుతున్న బెట్టింగ్ లావాదేవీలు
- కుటుంబాల్లో కలహాలు.. ఆర్థిక సంక్షోభం



**హైదరాబాద్, మే 2 :**

దేశవ్యాప్తంగా ఐపీఎల్ జోష్ యువతను ఉత్సాహపరుస్తున్నప్పటికీ, అదే సమయంలో ఆన్‌లైన్ బెట్టింగ్ అనే ప్రమాదకర అలవాటు అనేక కుటుంబాలను సంక్షోభంలోకి నెడుతోంది. స్మార్ట్‌ఫోన్‌లు, బెట్టింగ్ యాప్‌లు సులభంగా అందుబాటులో ఉండటంతో యువత వేగంగా ఈ మాయాజాలంలో చిక్కుకుంటున్నారు. సరదాగా ప్రారంభమైన పందేలు క్రమంగా భారీ నష్టాలకు దారితీస్తూ ఆర్థిక, మానసిక సమస్యలకు కారణమవుతున్నాయి.

మొదట చిన్న మొత్తాలతో ప్రారంభమయ్యే బెట్టింగ్.. గెలుపు ఆశతో క్రమంగా పెరుగుతూ వేల నుంచి లక్షల వరకు చేరుతోంది. ఒకసారి నష్టం చవిచూసిన తర్వాత తిరిగి సంపాదించుకోవాలనే ఆలోచన మరింత ప్రమాదంలోకి నెడుతోంది. దీంతో యువత స్నేహితులు, ఫైనాన్స్ యాప్‌లు, అప్పులదారులను ఆశ్రయించి అప్పులు తెచ్చుకుంటూ చివరకు చెల్లించలేని పరిస్థితిలో పడుతున్నారు.

ఈ ప్రభావం వ్యక్తిగత జీవితానికే పరిమితం కాకుండా కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సంపాదించిన డబ్బు మొత్తం బెట్టింగ్‌లో కోల్పోవడంతో ఇంటి ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోంది. కుటుంబ సభ్యుల మధ్య గొడవలు, భార్యాభర్తల విభేదాలు, తల్లిదండ్రుల ఆవేదన రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఈ పరిస్థితులు కుటుంబ బంధాలను కూడా ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

మనోవైద్య నిపుణుల ప్రకారం, బెట్టింగ్ ఒక వ్యసనంగా మారిన తర్వాత దాని నుంచి బయటపడటం చాలా కష్టం. మొదట వినోదంగా కనిపించినా, తర్వాత అది వ్యక్తిని పూర్తిగా నియంత్రణ కోల్పోయే స్థితికి తీసుకెళ్తుంది. భారీ నష్టాలు, అప్పుల ఒత్తిడి, సామాజిక భయం కలిసి కొంత మందిని తీవ్ర నిరాశలోకి నెడుతున్నాయి.

పోలీసులు ఇప్పటికే ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పలు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు నిర్వాహకుల పై కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ యువతలో అవగాహన లోపం, త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశ ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి. నిపుణులు కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే కౌన్సిలింగ్ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఐపీఎల్ క్రికెట్ సంబరంగా ఉండాల్సిన వేళ.. బెట్టింగ్ మోజు కారణంగా అది అనేక కుటుంబాలకు విషాదంగా మారుతోంది. యువత క్షణిక లాభాల ఆశకు లోనుకాకుండా భవిష్యత్తును కాపాడుకోవడం అత్యవసరం. సమాజం, కుటుంబం, ప్రభుత్వం కలిసి కట్టుగా పనిచేసినప్పుడే ఈ ప్రమాదకర ధోరణిని అరికట్టడం సాధ్యం.




## ప్రధాని సభను జయప్రదం చేయండి

- వాల్ రైటింగ్ క్యాంపెయిన్ ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 2 :**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని, ఆయన పర్యటనను జయప్రదం చేసేందుకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్రంలోని ప్రజలందరూ హాజరు కావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో హిమాయత్‌నగర్ నారాయణగూడాలో స్వయంగా వాల్ రైటింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించి అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రతి శాసనసభ నియోజకవర్గం నుంచి వేలాదిగా మహిళలు స్వచ్ఛందంగా తరలివస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ సమాజం మార్పు కోరుకుంటోందని, రాబోయే కాలంలో రాష్ట్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఒక కుటుంబ పాలన నుంచి, అవినీతి పాలన నుంచి తెలంగాణకు విముక్తి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఈ రోజు ఎక్కడ చూసినా బీజేపీకి అనుకూలమైన పవనాలు వీస్తున్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'సిందూర'తో యుద్ధం చేసి ఉగ్రవాదాన్ని దేశంలో తుద ముట్టించారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, పేద ప్రజలందరూ మోదీ వైపు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిషన్‌రెడ్డి చెప్పారు. కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేసి క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

# గ్రామీణ రోడ్ల అభివృద్ధిని జీర్ణించుకోలేకే..

**హైదరాబాద్ , మే 2 :**

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) రహదారులపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన ఆరోపణలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఖండించారు. వాస్తవాలను మరుగుపరిచి అర్థం లేని విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ఆవేశానికి లోనుకాకుండా ఆలోచనాత్మకంగా వ్యవహరించాలని ఒక ప్రకటనలో హితవు పలికారు. గ్రామీణ రహదారులను జాతీయ రహదారుల స్థాయిలో ఆధునీకీకరించడం, కొత్త రహదారుల నిర్మాణం చేపట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని జీర్ణించుకోలేకే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియ పూర్తికాకముందే అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. 'హామ'ను కేంద్ర రహదారి రవాణా మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా 2016 నుంచి విజయవంతంగా అమలు చేస్తోందని ఆమె తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 374కు పైగా ప్రాజెక్టులు, సుమారు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులతో ఈ మోడల్ ద్వారా రోడ్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల దీర్ఘకాలిక నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

# కాంగ్రెస్ కు మళ్లీ అధికారం కల్ల

- అడ్డూఅదుపు లేకుండా అవినీతి
- ఆ పార్టీ అరాచకాలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం
- ప్రజా వ్యతిరేక నిర్ణయాలు కొనసాగిస్తున్న బీజేపీ
- గ్యాస్ సిలిండర్ ధర రూ. వెయ్యి పెంపు ఇందులో ఒకటి
- ఉమ్మడి రంగారెడ్డి పార్టీ నేతల సమావేశంలో కేటీఆర్

**హైదరాబాద్ , మే 2 :**

రాష్ట్రంలో రెండున్నరేళ్ల పాలన చూసిన తర్వాత ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు మళ్లీ ఓటు వేసే అవకాశమే లేదని, ఆ పార్టీ కనీసం ఇరవయ్యేళ్లపాటు అధికారంలోకి రావడం కల్ల అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలను మోసం చేసిందని, దీనికితోడు ఆ పార్టీ నేతలు చేస్తున్న అవినీతి అరాచకాలు, కుంభకోణాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలతో నంది నగర్‌లోని తన నివాసంలో కేటీఆర్ సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలతోపాటు పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి అడ్డగోలుగా పెరిగిపోయిందని, అన్ని అంశాల్లోనూ కమీషన్లు, కాసుల కక్కుర్తితో వ్యవహరిస్తున్నదని, రంగారెడ్డి జిల్లాలో భూములతోపాటు అనేక మైనింగ్ కుంభకోణాలకు మంత్రులే స్వయంగా పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అరాచకాలు చూసిన తర్వాత ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ తెలిపారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదన్నారు. నిన్న కమర్షియల్ గ్యాస్ ధర రూ.వెయ్యి పైన పెంచడమే ఇందుకు ఒక ఉదాహరణ అని కేటీఆర్ అన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ పోతున్న బీజేపీ నిర్వాకం వల్ల ప్రజలపై నిత్యావసర సరకుల భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలపై బీజేపీకి వ్యతిరేకంగా ఎక్కడి నాయకులు అక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మరోసారి కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచకుండా ఉండడంతోపాటు నిన్న సిలిండర్ ధర పెంచినందుకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేయాలని కేటీఆర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ధరను వెనక్కి తీసుకొని ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. కాగా, పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై కేటీఆర్ సుదీర్ఘంగా మాట్లాడారు. త్వరలో జరగనున్న పార్టీ సభ్యత్వ నమోదు, తర్వాత జరిగే కమిటీల నిర్మాణంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. దీంతోపాటు రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో బీఆరఎస్ చురుకైన పాత్ర పోషించి కాంగ్రెస్, బీజేపీల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతి ఒక్క యువతి, యువకుడి ఓటు హక్కు కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయకుండా చూడాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నదని, ప్రజల ఓటు హక్కుకు బాధ్యతగా భరోసాగా నిలవాల్సిన అవసరం ఉన్నదని ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. అలాగే త్వరలో జీహెచ్ఎంసీకి ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు సమయత్తం కావాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మంచి విజయాలు నమోదు చేసినందుకు పార్టీ నేతలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.





**సంపాదకీయం**

## ప్రకృతి వైపరీత్యమా..
# హెచ్చరికా?

పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే అసాధారణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. తాజాగా 2026 మే-జూలై మధ్యకాలంలో ఎల్‌నినో పరిస్థితులు మళ్లీ బలపడవచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ (WMO) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావం.. అది భారత్ వంటి దేశాలపై చూపే సామాజిక-ఆర్థిక పరిణామాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినో అంటే ఏమిటి? స్పానిష్ భాషలో 'ఎల్‌నినో' అంటే 'చిన్న బాలుడు' లేదా 'క్రీస్తు శిశువు' అని అర్థం. పసిఫిక్ మహాసముద్రం తూర్పు, మధ్య ప్రాంతాల్లో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్నే 'ఎల్‌నినో' అంటారు. ఇది సహజంగా జరిగే ప్రక్రియ అయినప్పటికీ, భూతాపం పెరగడం వల్ల దీని తీవ్రత అంతకంతకూ పెరుగుతోంది.

**భారత్‌పై ప్రభావం...కరువు ముప్పు?**

భారతదేశానికి సంబంధించి ఎల్‌నినో అత్యంత ఆందోళనకరమైన అంశం. భారత వాతావరణ శాఖ (IMD) అంచనా ప్రకారం రుతుపవనాలపై ప్రభావం చూపిస్తోంది. నైరుతి రుతుపవనాలు బలహీనపడి, సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రిజర్వాయర్ల మట్టాలు పడిపోయాయి. ఎల్‌నినో కొనసాగితే ఈ పరిస్థితి మరింత దిగజారవచ్చు. వర్షాభావం వల్ల ఖరీఫ్ పంటలు దెబ్బతింటాయి. ఇది ఆహార ధాన్యాల కొరతకు, ధరల పెరుగుదలకు (ద్రవ్యోల్బణం) దారితీస్తుంది. 2024 ఇప్పటికే చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. రాబోయే 12-18 నెలల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల భూమి సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక పూర్వ స్థాయి కంటే 1.7 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భారత్‌తో పాటు పలు దేశాల్లో ప్రాణాంతకమైన వడగాల్పులు సంభవిస్తాయి. దక్షిణ అమెరికా దేశాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తే.. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, భారత్ వంటి దేశాల్లో తీవ్ర కరువు ఏర్పడుతుంది. అయితే ఎల్‌నినోను మనం ఆపలేకపోవచ్చు, కానీ దాని ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. శాస్త్రీయ అంచనాల ఆధారంగా విపత్తు నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం కీలకం. నీటి సంరక్షణ, కరువును తట్టుకునే పంటల సాగు, అంతర్జాతీయ సహకారం ద్వారా మాత్రమే ఈ పర్యావరణ సవాలును ఎదుర్కోగలం. ప్రకృతి ఇస్తున్న ఈ హెచ్చరికను గమనించి, పర్యావరణ సమతుల్యత కోసం ముందస్తు చర్యలు తీసుకోవడమే నేడు మన ముందున్న ఏకైక మార్గం.

## నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల (సిరి న్యూస్):**

నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో కలుపు మందులు, నకిలీ విత్తనాల నియంత్రణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మీరటి రాజేశ్వరి తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాల వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని నివారించేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, నిషేధిత కలుపు మందుల వల్ల కలిగే నష్టాలను వివరించాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో దుకాణాలు, డీలర్లపై తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ సంబంధిత శాఖల సమన్వయంతో నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, విత్తనాలు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మకుంట చెరువే.. వదంతులకు హైడ్రా ఫుల్‌స్టాప్

- 1975 రికార్డులు, శాటిలైట్ చిత్రాలతో హైడ్రా స్పష్టీకరణ
- అంబర్‌పేట బతుకమ్మకుంటపై యాజమాన్య వివాదానికి కీలక మలుపు
- చెరువు భూమిపై గేట్లు, బోర్డుల తొలగింపు
- ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగిస్తామన్న కమిషనర్ రంగనాథ్
- చెరువుల పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని పిలుపు

**హైదరాబాద్, మే 2 :**




అంబర్‌పేటలోని బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువేనని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కొనసాగుతున్న వివాదాలు, ప్రచారాలు, వదంతులకు ముగింపు పలుకుతూ చారిత్రక రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, సర్వే ఆధారాలను ప్రజల ముందుంచారు. హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన బతుకమ్మకుంట చరిత్ర, భౌగోళిక స్థితిగతులను స్పష్టంగా వివరించారు.
1975 ఇరిగేషన్ శాఖ రికార్డుల ప్రకారం బతుకమ్మకుంట చెరువుగా నమోదైందని, సర్వే నంబర్ 563/1లో సుమారు 9.19 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు తెలిపారు. చెరువు కట్ట సర్వే నంబర్ 563/2లో ఉన్నట్లు రెవెన్యూ, జీహెచ్ఎంసీ పత్రాలు కూడా నిర్ధారిస్తున్నాయని వెల్లడించారు. 1971 సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్, 1989 నాసా ల్యాండ్‌సాట్ చిత్రాలను విడుదల చేస్తూ గతం నుంచి ఇప్పటి వరకు చెరువు స్వరూపం ఎలా ఉందో వివరించే ప్రత్యేక వీడియోను కూడా ప్రదర్శించారు. బతుకమ్మకుంటపై తుది నిర్ణయం వెలువడే వరకు ఎవరూ వ్యక్తిగత యాజమాన్యం ప్రకటించరాదన్న నిబంధనల మేరకు అక్కడ ఏర్పాటు చేసిన గేట్లు, బోర్డులను తొలగించినట్లు కమిషనర్ చెప్పారు. ఫెన్సింగ్ తొలగిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని సుప్రీంకోర్టుకు నివేదించినట్లు వెల్లడించారు. చెరువులు ప్రభుత్వానికో, ప్రైవేటు వ్యక్తులకో చెందినవి కావని.. అవి ప్రజల ఉమ్మడి ఆస్తులని రంగనాథ్ స్పష్టం చేశారు. నీటి మట్టం తగ్గినప్పుడు మాత్రమే పరిమిత వ్యవసాయ కార్యకలాపాలకు అనుమతి ఉంటుందని, చెరువు స్వరూపాన్ని మార్చే శాశ్వత నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తేల్చిచెప్పారు. హైడ్రా ఇప్పటివరకు 2093 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుందని, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధి, నాలాలు, పార్కులు, రహదారులపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. ఈ భూముల అంచనా విలువ రూ.80 వేల కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. నగర చెరువుల పునరుద్ధరణలో భాగంగా తొలి దశలో ఆరు చెరువులు, రెండో దశలో మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో నగరంలోని అన్ని చెరువులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. చెరువుల వద్ద నివాసాలు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. చెరువుల పరిరక్షణలో చట్టబద్ధత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ముందుగా నోటీసులు, గడువు ఇచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా స్పష్టం చేసింది. బతుకమ్మకుంట వ్యవహారం నగర చెరువుల సంరక్షణలో కీలక ఉదాహరణగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు.

# చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం

- పూడికతీతతో చెరువులలో జలాశయాలు నింపాలి
- చెరువుల అక్రమణలపై ఉక్కుపాదం
- జూరాల, మూసీల పూడికతీతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మే 2:**



వేసవికాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పూడికతీత పనులు చేపట్టి చిన్న తరహా చెరువులన్నింటిని పునరుద్ధరించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పూడికతీత తో పునరుద్ధరించిన చెరువుల్లో వచ్చే వర్షాకాలంలో జలాశయాలతో కళకళలాడేలా చూడాలని ఆయన సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్ననీటి పారుదల చెరువులపై సీనియర్ కాంగ్రెస్ నేత తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ అధ్యక్షుడు యం .కోదండ రెడ్డి ఆధ్వర్యంలో రూపొంచిన నివేదిక అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ నివేదికను తదుపరి చర్యల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల పూడికతీత పనులపై ఎర్రమంజిల్ కాలనీ లోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పూడికతీత పనులు చేపట్టి చెరువులు పునరుద్ధరణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీల ఆవశ్యకతను ఆయన వివరించారు.కొత్తగా ఏర్పాటు చేసే కమిటీలు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా విధి విధానాలు రూపొంచాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా చెరువులు ఆక్రమణలకు గురైతే తక్షణమే చర్యలు చేపట్టి స్వాధీనం చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.బఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవరించాలన్నారు. దానితో పాటుగా ఎఫ్.టి.ఎల్ లెవల్ ను గుర్తించి సరిహద్దులు నిర్ణయించాలన్నారు.ఇందుకుగాను నీటిపారుదల శాఖాధికారులు రేవిన్యూ, వ్యవసాయ శాఖాధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. పూడిక తీతకు ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నందున తక్షణమే వాటిని అమలులోకి తీసుకొచ్చి పనులు ప్రారంభించేయాలన్నారు. రెండు నెలల వేసవికాలం వ్యవధిలో ఈ పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. సుమారు నెలన్నర క్రితమే ఈ పనులు చేపట్టాలని ఆదేశించినా ప్రతిపాదనలు రూపొందించడంలో జాప్యం ఎందుకు జరిగిందంటూ అధికారులను ఆయన నిలదీశారు. చెరువుల స్థిరీకరణలో భాగంగ చెరువు కట్టలు,తూములు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించి మ్యాపింగ్ చేయలన్నారు. నీటి పారుదల శాఖా వద్ద ఇప్పటికే ఉన్న సమాచారం ఆధారంగా చెరువుల పునరుద్ధరణలో భాగంగా పూడిక తీత పనులతో పాటు చెరువు కట్టలను బలోపేతం చేస్తూ తూముల మరమ్మతులు చేపట్టాలన్నారు. జూరాల,మూసి ప్రాజెక్టుల పూడిక తీతకు సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే రూపొంచాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా
### ట్రాఫిక్ విధులు నిర్వహించండి

**మొదటిపేజీ తరువాయి**

తెలిపారు, ఈ ప్రమాదాల నివారణకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్ లో తన కార్యాలయంలో ట్రాఫిక్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వాహనాల వేగాన్ని కచ్చితంగా నియంత్రించడంతో పాటు, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు డిజిపి స్పష్టం చేశారు. ముఖ్యంగా నగరంలో వాహనదారులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.జీహెచ్ఎంసీ పరిధిలోని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్లు, డీసీపీలతో నిర్వహించిన ఈ సమావేశంలో నగరంలో నెలకొన్న ట్రాఫిక్ పరిస్థితులపై డిజిపి సివి ఆనంద్ కూలంకషంగా సమీక్షించారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలను అవలంబించాలని, అవసరమైన చోట పటిష్టమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే 'ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో'ను ఏర్పాటు చేయనుందని, దీనికి సంబంధించిన కసరత్తు జరుగుతోందని ఆయన వెల్లడించారు. ఈ బ్యూరో అతి త్వరలోనే అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుందని డిజిపి ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను , హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారి పైన చట్టం ప్రకారం వ్యవహరించాలని, నిబంధనల అమలుపై క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ చందన దీప్తితో పాటు ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, కాజల్ సింగ్, రాహుల్ రెడ్డి, అవినాష్ కుమార్, శేషాద్రిని రెడ్డి, శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులతో సానుకూలంగా వ్యవహరించాలి

**హైదరాబాద్, మే 2 :**

ఆర్టీసీలో పని చేసే డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కింది స్థాయి సిబ్బందిపై అధికారులు వేధింపు ధోరణితో కాకుండా స్నేహపూర్వక వాతావరణం లో పనిచేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులకు సూచించారు. సిబ్బందితో దురుసుగా ప్రవర్తించకుండా, ఆప్యాయతతో, స్నేహపూర్వక వాతావరణంలో వారి ద్వారా పనులు చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సిబ్బంది సమస్యలను నేరుగా వినేందుకు ప్రతి నెల రెండో మంగళవారం అన్ని డిపోలలో ఫిర్యాదుల పరిష్కార సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. మే 17వ తేదీలోగా అన్ని డిపోలు, బస్ స్టేషన్లలో ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచాలని డిపో మేనేజర్లను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతి, పచ్చదనం, పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. టికెటింగ్ విషయంలో తలెత్తే సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, సిబ్బందితో వాగ్వాదాలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. శనివారం ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డితో కలిసి ఉన్నతాధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు లేవనెత్తిన అంశాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. అధికారులు, సిబ్బంది ప్రయాణికుల పట్ల సానుకూల వైఖరిని అవలంబించాలని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ.. జూన్ నెలాఖరులోగా బస్టాండుల్లోని కమర్షియల్ షాపులకు సంబంధించిన పెండింగ్ అంశాలను, ఇతర పరిపాలనాపరమైన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో సంస్థను మరింత లాభదాయకంగా, సేవా దృక్పథంతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సిహెచ్. వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, సాలోమన్, ఎఫ్ఏ విజయపుష్ప, సిటీఎం శ్రీదేవితో పాటు వివిధ విభాగాల హెచ్ఓడీలు, రీజినల్ మేనేజర్లు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు

# పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

- విద్య, క్రీడలు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం
- మంత్రి పొంగులేటి
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ భవనానికి శంకుస్థాపన

**దుమ్ముగూడెం, మే 2:**



ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికే ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమా చార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మం డలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శం కుస్థాపనలు నిర్వహించారు. ముందుగా దు మ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చే శారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమై న విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందిస్తామన్నారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులు ఒకే చోట ఉంటాయని చెప్పారు. అనంతరం చింత గుప్ప గ్రామం నుంచి బురద మడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డుతో చింత గుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవుతందని తెలిపారు. ములకపాడులోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్ తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకు స్థాపన చేశారు. మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకితో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రా మీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకె ళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సా ధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మా ట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడు తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎం తో ఉపయోగపడతాయని తెలిపారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇం టిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురా వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. కార్య క్రమాల్లో ఎస్పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**ఎమ్మెల్యే జీఎంఆర్**

**రూ.15 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్**

**పారదర్శకంగా నిధుల కేటాయింపు**

**ప్రశాంతంగా ముగిసిన కో-ఆప్షన్ ఎన్నికలు**

**బీఆర్ఎస్ ఖాతాలో నాలుగు పదవులు**



**రామచంద్రపురం (పటాన్చెరు), మే 2 (సిరి న్యూస్):**

ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేయాలని తెలిపారు.రుద్రారం వార్డు కార్యాలయంలో జరిగిన కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికలో ఎమ్మెల్యే ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ తరఫున విష్ణువర్ధన్ రెడ్డి, బండ సోనియా, నిజాముద్దీన్ బాబా, ఆసియా బేగం కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.అనంతరం జరిగిన సమావేశంలో ప్రతి వార్డు కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, కౌన్సిలర్లు ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవు తాయని తెలిపారు.నిధుల కేటాయింపులో సమానత్వం, పారదర్శకత పాటించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుమలత, కమిషనర్ వెంకట కిషన్, సీనియర్ నాయకులు గడిల శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైల్వే ట్రాక్ పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

**రామచంద్రపురం, మే 2, (సిరి న్యూస్):**



వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం సుమారు 08:40 గంటల సమయంలో తెల్లాపూర్–లింగంపల్లి రైల్వే మార్గంలోని కిలోమీటర్ నంబర్ 158/3 వద్ద ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.పోలీసుల వివరాల ప్రకారం, సుమారు 25–30 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తుతెలియని యువకుడు రైల్వే ట్రాక్ పక్కన మృతిచెందిన స్థితిలో కనిపించాడు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. అయితే కుడి చేతిపై టాటూ గుర్తు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నేవీ బ్లూ రంగు టీ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, మృతుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రజల సహకారం కోరుతున్నారు. మృతుడి గురించి ఏమైనా సమాచారం తెలిసిన వారు వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**మహిళా సంఘాలకు రూ.195.18 కోట్ల రుణాల పంపిణీ**

**టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, (సిరి న్యూస్):**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ వంటి పథకాల అమలుతో పేదలకు మేలు జరుగుతోందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయలేదని విమర్శిస్తూ, ప్రస్తుతం అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు రూ.195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో జ్యోతి, ఆర్డీఓ రాజేందర్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, శివాజీ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

- అబద్ధాల హస్తంను తరిమి కొట్టాలి.
- మే 10 న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన...
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు వెల్లడి



**రామాయంపేట, మే 2 (సిరి న్యూస్)**

ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను వంచించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నారప రాజు రాంచందర్ రావు ధ్వజమెత్తారు. శనివారం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోనిప్రగతి రిసార్ట్స్ లో జరిగిన బిజెపి కార్యకర్తల సమావేశానికి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు తో కలిసి, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అభయహస్తం హామీలు ఇప్పుడు అబద్ధాల హస్తంగా మారాయని రాంచందర్ రావు విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అదే విధంగా రైతు భరోసా, రుణమాఫీ అందక రాష్ట్రంలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని ఆయన ఆరోపించారు.

**మే 10 న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన**

ఈ నెల మే 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నట్లు రాంచందర్ రావు వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా సుమారు రూ. 7,800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. వరంగల్‌లోని మామ్నూర్ విమానాశ్రయ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, ఎంతో కాలంగా రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్న కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీని ప్రధాని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

**అభివృద్ధికి ఊతం ఇచ్చే భారీ బహిరంగ సభ**

ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించనున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నారప రాజు రామచందర్ రావు తెలిపారు .రాష్ట్ర అభివృద్ధి కేవలం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతోనే సాధ్యమని, ప్రజలంతా ఇప్పుడు 'డబుల్ ఇంజిన్ సర్కార్' వైపు మొగ్గు చూపుతున్నారని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికి ప్రజలు భారీగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు, బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి పంజా విజయ్ కుమార్,జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్, మండల బిజెపి అధ్యక్షుడు , లక్ష్మాపూర్ సర్పంచ్ నవీన్ గౌడ్, సర్పంచులు బక్కయ్య గారి యాదగిరి, ఆకుల రమేష్, బిజెపి ముఖ్య నేతలు పబ్బ సత్యం గుప్తా, చింతల శేఖర్, వెల్మల సిద్ధ రాములు, అవినాష్ రెడ్డి, గోల్పర్తి బాపూరెడ్డి, ఫర్టిలైజర్ రమణ, భానుచందర్ , తీగల శ్రీనివాస్ గౌడ్, రాంపూర్ ప్రవీణ్, నరేందర్, బాసం అనిల్, కన్నయ్య, నాగరాజు, సంతోష్, యాదగిరి యాదవ్,తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం అందజేసిన ఉద్యమ నేత

**రామాయంపేట, మే 2 (సిరి న్యూస్)**



శనివారం నాడు రామాయంపేట పట్టణంలోని బిజెపి కార్యాలయం కు వచ్చిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చంద్రరావు ను, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను కలిసి రామాయంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం నియోజకవర్గం కేంద్రం సమ స్యల పైన వినతి పత్రం అందజేసినట్లు ఉద్యమ నేత పోచమ్మల అశ్విని శ్రీనివాస్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ మెదక్ కలెక్టరేట్ ప్రారంభోత్సవ సందర్భంగా బహిరంగ సభలో రామాయంపేట ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించారనీ, అయినా ఇంతవరకు ఆర్డీవో మరియు ఇతర సిబ్బంది ఏర్పడకపోవడంతో ఏ విధమైన రెవెన్యూ పని కొరకైన మెదక్ ఆర్డీవో కార్యాలయం వెళ్ళవలసి వస్తుందన్నారు.రామాయంపేట పట్టణ అభివృద్ధికి నోచుకోవడం లేదనీ, రామాయంపేట ప్రజల చిరకాల కోరిక అయిన ఆర్డీవో అధికారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని అలాగే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నియోజకవర్గాల పునర్విభజనలో గతంలో కోల్పోయిన రామాయంపేట ను తిరిగి నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేసి రామాయంపేట అభివృద్ధికి సహకరించాలని కోరడం జరిగిందన్నారు.రామాయంపేటలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ప్రారంభోత్సవం చేసిన మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు ను కలిసి రెవెన్యూ డివిజన్ ప్రక్రియ గురించి మాట్లాడతానని రామచంద్ర రావు తెలిపినట్లు అశ్విని శ్రీనివాస్ తెలిపారు. అలాగే మలిదశ రెవెన్యూ డివిజన్ ఉద్యమంలో మాకు మద్దతు తెలిపిన ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావును కలిసి రెవెన్యూ డివిజన్ అంశంపై మాట్లాడతానని తెలిపినట్లు చెప్పారు.

# పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, మే 2 (సిరి న్యూస్):**



ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ సూచించారు. శనివారం పురపాలక సంఘం కార్యాలయంలో ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 565 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పుట్నాల తేజేశ్వరిని చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో, అకుంఠిత దీక్షతో చదివితే ఎలాంటి ప్రతిబంధకాలు వచ్చినా అధిగమించగలరని పేర్కొన్నారు. తేజేశ్వరి సాధించిన విజయం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా గుమ్మడిదల మండలానికి గర్వకారణమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా సరైన మార్గదర్శకం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉంటే వారు అత్యున్నత ఫలితాలు సాధించగలరని స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన తేజేశ్వరి 565 మార్కులు సాధించడం ఆమె కృషి, తల్లిదండ్రుల త్యాగానికి ప్రతిఫలమని కొనియాడారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, లక్ష్య సాధన దిశగా కృషి చేస్తే భవిష్యత్తులో దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారికి అవసరమైన ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలని సూచించారు. పిల్లలలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు మరింత ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలిపారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన పుట్నాల తేజేశ్వరిని, ఆమె తల్లిదండ్రులను చైర్మన్ మరియు కౌన్సిలర్లు అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు ఆకుల మాధవి, మద్ది సోని, సరెరెడ్డి గారిపద్మ, పొన్నాల ప్రమీల, సప్పటి పద్మ, గౌసియా, తుపాకుల రాధిక, గిద్దె విజయలక్ష్మి, రమేష్, చక్రపాణి, మురళి, కిషన్, సంజీవరెడ్డి, కుమార్ గౌడ్, నాయకులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు

- ప్రతి ఇంటికి నిరంతర సరఫరా లక్ష్యం
- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, మే 2 (సిరి న్యూస్):**

వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా గుమ్మడిదల మున్సిపాలిటీ ముందస్తు చర్యలను పటిష్టంగా అమలు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఎక్కడా తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో తాజాగా తవ్వించిన బోరు బావులకు శనివారం బోర్ మోటార్లను అమర్చి నీటి సరఫరాను అధికారికంగా ప్రారంభించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి నిరంతరాయంగా తాగునీరు అందించడమే మున్సిపాలిటీ లక్ష్యమని చెప్పారు. పైపులైన్‌ల మరమ్మతులు, కొత్త బోరు బావుల తవ్వకం, మోటార్ల ఏర్పాటు వంటి చర్యల ద్వారా నీటి సరఫరాను మరింత మెరుగు పరుస్తున్నామని వివరించారు. వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను సమయానికి తీర్చేందుకు మున్సిపాలిటీ యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. వేసవిలో నీటి కొరత లేకుండా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు సారెడ్డి పద్మరెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, మేడిపల్లి మురళి, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, బెంబడి సంజీవరెడ్డి, మద్ది సోనీ రెడ్డి, షేక్ గౌసియా, ఆకుల మాధవి, కత్తుల రమేష్, పొన్నాల ప్రమీల, సురభి కుమార్ గౌడ్, గిద్దె విజయలక్ష్మి, శ్రీచూర్ణం చక్రపాణి, చప్పటి పద్మ, నాయకులు వెంకట్రాంరెడ్డి, హుస్సేన్, రాజు, శేఖర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వరి ధాన్యాన్ని విక్రయించాలి

**• సర్పంచ్ సామల మైపాల్ రెడ్డి**

**గుమ్మడిదల, మే 2( సిరి న్యూస్):**

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వరి ధాన్యాన్ని విక్రయించుకో వాలని సర్పంచ్ సామల మైపాల్ రెడ్డి తెలిపారు. శనివారం గుమ్మడిదల మండల పరిధిలోని రాంరెడ్డి భాయి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సామల మహిపాల్ రెడ్డి, రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచే స్తోందని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజకు న్యాయమైన ధర అందించేందుకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కీలకంగా మారాయని తెలిపారు.



మధ్యవర్తుల దోపిడీకి గురికాకుండా రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని తీసుకువచ్చి అమ్ముకో వాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధర రైతులకు ఆర్థిక భద్రతను కల్పిస్తుందని ఆయన అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవస రమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం తూకం, నాణ్యత పరీక్షలు, చెల్లింపులు వంటి అంశాలలో పారదర్శకత ఉండాలని, రైతులు ఎటువంటి సమస్యలను ఎదుర్కొన్నా వెంటనే సంబంధిత అధికారులకు తెలియ జేయాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. వ్యవసాయం లాభదాయకంగా మారాలంటే ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు పూర్తిగా వినియోగించు కోవాలని సూచించారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపే తానికి రైతులు కీలకమని, రైతు బలపడితే దేశం బలపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయంతి రెడ్డి వార్డు మెంబర్ కృష్ణ గౌడ్, గుమ్మడిదల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షులు నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డి భూపాల్ రెడ్డి హరివర్ధన్ రెడ్డి చంద్రారెడ్డి, కరుణాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు లక్ష్మణ్ నాయక్, గ్రామ పెద్దలు, యువకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజా పాలన






**• ప్రగతి ప్రణాళిక పై సమావేశం**

**కొంపల్లి.మే,02(సిరి న్యూస్).**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం సందర్భంగా శనివారం నాడు కొంపల్లి లోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో సీఈఓ కాంతమ్మ అధ్యక్షతన నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్నికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తోపాటు నియోజకవర్గ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నేరుగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకు వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేసారు. పేద లు ప్రజ లు. రైతులు. మ హిళ లు, యువ త , మైనారిటీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రత్యేకంగా మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, మైనారిటీ యువతకు ఉచిత స్కూటీలు, మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ స్వావలంబన దిశగా ప్రభుత్వం ముందుకె ళ్తోందని స్పష్టం చేశారు.ఈ పథకాలు మైనారిటీ కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు మైనారిటీ మహిళలకు సుమారు 400 ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కుట్టుమిషన్లు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపర చడంలో కీలకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.అలాగే ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా పాలన యొక్క ముఖ్య ఉద్దేశమని ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,అన్ని శాఖల ప్రతినిధులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు ప్రజలు పాల్గొన్నారు.



# అప్పాజీపల్లి పదవ తరగతి విద్యార్థులకు ఘన సన్మానం

**కొల్చారం మే 02 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి చింతల శివకోటి గ్రామ సర్పంచ్ గజినీ వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సన్మానం చేశారు.500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు శాలువాలు కప్పి అభినందనలు తెలుపుతూ వారి కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో రెండో స్థానం సాధించిన మధుశ్రీకి రూ.5,000 నగదు బహుమతిని అందజేసి ఆమె ప్రతిభను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు విద్యార్థుల విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రోత్సాహం అందించాలని కోరారు.చింతల శివకోటి మాట్లాడుతూ, "గ్రామంలోని విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరాలని, తమ లక్ష్యాలను సాధించాలని" ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారం అని ఆయన పేర్కొన్నారు.ఈ సన్మాన కార్యక్రమం గ్రామంలో విద్య పట్ల ఉన్న గౌరవాన్ని మరోసారి చాటిచెప్పింది. విద్యార్థులు కూడా మరింత కష్టపడి ఉన్నత స్థానాలను సాధించాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ సభకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి ఆదేశాలు

**• సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలి.**

**• నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు.**

**రామాయంపేట, (నార్సింగి) మే 2 (సిరి న్యూస్)**




శనివారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేసి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. శాంతిభద్ర తలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా సమగ్ర భద్రత కల్పించాలని పేర్కొన్నారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని, తెలియని కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని, మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు.నేరాల నియం త్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని, వ్యాపారులు, ప్రజాప్రతి నిధులు, స్థానికుల సహకారంతో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎస్పీ తెలిపారు.అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ సృజన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాధ్యతలు స్వీకరణ



**తూప్రాన్ మే 2 సిరి న్యూస్**

తూప్రాన్ నూతన మార్కెట్ కమిటీ కి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం రోజు చైర్ పర్సన్ గా యంజాల కీర్తన విఠల్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు వైస్ చైర్మన్ గా మామిండ్ల కృష్ణ ముదిరాజ్ డైరక్టర్ లు గా సింగి మైపాల్ రెడ్డి జక్కిడి ప్రభాకర్ రెడ్డి గొల్లపల్లి సురేందర్ రెడ్డి దాసరి నాగరాణి శ్రీకాంత్ నావబోత్ శ్రీనివాస్ మాదం శెట్టి వెంకటేష్ గుప్తా సంద వెంకటేష్ యాదవ్ మహ్మద్ హమీద్ ఊట్ల సత్య నారాయణ ముదిరాజ్ దొడ్ల వెంకటేష్ లక్ష్మణ్ లు కార్యాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు కీర్తన రెడ్డి మాట్లాడుతూ నా పై నమ్మకం తో బాధ్యత అప్పగించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తుంకుంటా నర్సారెడ్డి కి ప్రతేక ధన్యవాదములు తెలిపారు తూప్రాన్ రైతు వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేసి 9 ఏళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నూతన పాలక వర్గం ఏర్పాటు కావడం రైతులు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు ఉమ్మడి తూప్రాన్ మండలానికి కొత్త మార్కెట్ కమిటీ ఏర్పాటుతో రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల్లో మరింత సౌలభ్యం కలుగుతుంది మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్‌తో పాటు 11 మంది డైరెక్టర్లను నియమించారు త్వరలో నే మంత్రి పార్టీ ఇంచార్జ్ లతో భారీ గా రైతుల తో సభ ఏర్పాట్లు చేస్తాం అని పాలక వర్గం తెలిపారు ఈ కార్యక్రమం లో మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గంగుమల ఎలక్షన్ రెడ్డి మాజీ ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్ మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు యంజాల సుధాకర్ రెడ్డి సర్పంచ్ లు కాంగ్రెస్ నాయకులు హాజరై చైర్మన్ పాలక వర్గాని సన్మానించారు

# అర్హత లేని ఆసుపత్రికి నోటీసులు

**• అర్హత లేకున్నా గర్భిణీ లకు**

**• వైద్యం అందిస్తున్నా ఆసుపత్రికి జిల్లా అధికారులు నోటీసుల జారి**

**• భవాని క్లినిక్ గత 20 ఏళ్లుగా తూప్రాన్ పట్టణంలో**

**• నిర్వహిస్తున్న అధికారులకు తెలియకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు**



**తూప్రాన్ మే 2 సిరి న్యూస్**

తూప్రాన్ పట్టణం లో ఎలాంటి అనుమతులు లేకున్నా గర్భిణీ మహిళలకు పరీక్షలు చేస్తూ స్కానింగ్ కు రేపర్ చేయడం పై పిర్యాదు రాగ ఆసుపత్రి ని తనిఖీ చేసి ఆపరేషన్ కు వాడే సామాగ్రి ని సిజ్ చేశారు అయినా అదేవిధంగా చికిత్స చేయడం తో శనివారం రోజు భవాని క్లినిక్ నిర్వహిస్తున్న సలీలా కు వైద్యం చేయడానికి గల అర్హత లు సర్టిఫికెట్ లను జిల్లా వైద్య అధికారి కార్యాలయం లో ఇవ్వాలని నోటీసులు అందజేసిన డిప్యూటీ వైద్య అధికారి జానేశ్వర్ సిబ్బంది ఈ భవాని క్లినిక్ గత 20 ఏళ్లుగా తూప్రాన్ పట్టణంలో నడిపిస్తున్నారు ఇప్పటి వరకు ఈ క్లినిక్ ఉన్నా విషయం అధికారులకు తెలియకపోవడం పట్ల ప్రజలు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# కొంగోడు మత్స్యశాఖ సహకార సంఘం గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**కొల్చారం మే 2 )సిరి న్యూస్)**

కొల్చారం మండల పరిధిలోని కొంగోడు గ్రామంలో మత్స్యశాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ మత్స్యశాఖ చైర్మన్‌గా గంపల పరశురాం ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా పైసా భూమయ్య, కార్యదర్శిగా కొత్త గోపాల్ బాధ్యతలు స్వీకరించారు.డైరెక్టర్లుగా ఎడ్ల రమేష్, కొన్నాళ్ల సత్యనారాయణ, వంజరి యాదగిరి, బదంపేట ఏసు, పైస దుర్గయ్య, మంజరి మల్లేష్ ఎంపికయ్యారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం విశేషంగా చెప్పుకోవాలి.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖకు చెందిన గంపల లక్ష్మయ్య, సిద్దిరాములు, ఉప సర్పంచ్ ఎడ్ల మల్లేశం, బదంపేట సిద్దిరాములు తదితర సభ్యులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధి కోసం కొత్త కమిటీ కృషి చేయాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బాలల రక్షణకు అవగాహన కార్యక్రమాలు

- భరోసా సెంటర్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం
- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చర్యలు




**సంగారెడ్డి, మే 2, (సిరి న్యూస్):**

ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగారెడ్డి భరోసా సెంటర్ ఆధ్వర్యంలో చైల్డ్ సేఫ్టీ, బాలల రక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో సంయుక్త పాఠశాలలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు, సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్ వద్ద కూలీలకు అవగాహన కల్పించారు. బాలల సంక్షేమం, యువత అభివృద్ధి అంశాలపై వివిధ కోణాల్లో వివరించారు. ఈ సందర్భంగా భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని పాటిస్తూ ఆడ, మగ అనే తేడా లేకుండా పిల్లలను సమానంగా చూడాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, వాటిని పూర్తిగా నిరోధించాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ, బాలలపై జరిగే నేరాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నిందితులకు కఠిన శిక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. బాధితులు మౌనం వీడి ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, అప్పుడే న్యాయం జరిగి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లతో పాటు జిల్లా భరోసా సెంటర్ నంబర్ 8712656773 ను తమ మొబైల్ ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా సమాజంలో బాలల భద్రతపై చైతన్యం పెంపొందించడం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# న్యాయం ప్రతిరోజు మీ ముందే

## జడ్జిగా పట్లోళ్ల తేజ శ్రీ బాధ్యతలు

## స్వాగతం పలికిన బార్ అసోసియేషన్ సభ్యులు



**జిన్నారం మే 2 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ జడ్జిగా పట్లోళ్ల తేజ శ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు.దీనితో న్యాయవ్యవస్థ స్థానికంగా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. న్యాయవాదుల హర్షం కోర్టు సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో బార్ అసోసియేషన్ సభ్యులు స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఇది న్యాయవాద వృత్తిలో ఉన్న వారికి కక్షిదారులకు ఎంతో మేలు చేస్తుందని వారు పేర్కొన్నారు. ప్రజలకు చేరువలో న్యాయం గతంలో చిన్న చిన్న కోర్టు పనుల కోసం దూర ప్రాంతాలకు సంగారెడ్డి లేదా నర్సాపూర్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు జిన్నారం లోనే కోర్టు ఉండడంతో సామాన్యులకు సమయం డబ్బు ఆదా అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు బాలకిషన్, శ్రీధర్ రెడ్డి, మోహన్, కృష్ణ స్వామి, వెంకటరామిరెడ్డి, నవరత్న్, రఘునాథ్ ,రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపల్లి గ్రామంలో విషాదం

## నీటి గుంతలో మునిగి బాలుడు మృతి

**కొల్చారం / మే 2 (సిరి న్యూస్)**



మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మస్తీ నాగరాజు (14), తండ్రి కిష్టయ్య, ఎస్సీ (మాల) వర్గానికి చెందిన బాలుడు, శనివారం ఉదయం సుమారు 8:15 గంటల సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.వివరాల ప్రకారం, నాగరాజు తన స్నేహితులు నిరుడి ప్రశాంత్, సార చైతన్యలతో కలిసి గ్రామ శివారులోని మన్నే కిష్టయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో ఉన్న అగ్రికల్చరల్ ఫామ్ పాండ్ వద్దకు వెళ్లాడు. అక్కడ స్నానం చేస్తుండగా అనుకోకుండా లోతైన నీటిలోకి వెళ్లి మునిగిపోయినట్లు సమాచారం.బాలుడు కనిపించకపోవడంతో అతని స్నేహితులు స్థానికులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని శోధన చేపట్టగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిసింది.మృతుడి తల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి. ఘటనపై ఎస్ఐ మొహనుద్దిన్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు

# మోడీ రాకతో బీజేపీ నాయకుల సన్నాహక సమావేశం

- పాల్గొన్న కిషన్ రెడ్డి.రాంచందర్ రావ్ .ఈటెల రాజేందర్.డా మల్ల రెడ్డి.
- 10వ తేదీన నగరానికి మోడీ రాకతో సర్వం సిద్ధం చేసుకోవాలి.
- మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ.
- కొంపల్లిలో హైదవ కన్వెన్షన్ హాల్ సన్నాహక సమావేశం.



**కొంపల్లి.మే,02(సిరి న్యూస్).**

మే 10వ తేదీన నగరానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడానికి విచ్చేస్తున్న సందర్భంగా పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి ముందస్తుగా మేడ్చల్–మల్కాజ్ గిరి అర్బన్ జిల్లా బీజేపీ నాయకులు సన్నాహక సమావేశాన్ని శనివారం నాడు కొంపల్లిలోని హైందవ కన్వెన్షన్ హాల్ నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అథిదుతులుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావ్ .మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ లు పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాని ప్రారంభించారు.సుమారు 2000 వేల మందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన రాష్టానికి మోడీ రాకతో నగరం మొత్తం కాషాయ మాయం కావాలని ప్రతి ఒక్క డివిజన్ నుండు పేద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు ఛలో పరేడ్ గ్రౌండ్ నినాదంతో పాల్గొని విజయవంతం చేయాలనీ అన్నారు.ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు.ఈ భారీ బహిరంగ సభలో నారి శక్తికి పార్టీ పేద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తుందని మహిళలతో చిన్నారులతో కలిసి సుమారు10 వేలా మందితో మోడీకి స్వాగతం తెలుపుతూ 3వేల మంది డప్పు కళాకారులతో సుస్వాగతం ఉంటుందని ఆనందం వ్యక్తం చేశారు.ప్రతి డివిజన్లో బారి ఎత్తున హొడింగ్స్ వేయాలని కరపత్రాలతో పాటు ప్రతి ఇంటికి ఆహ్వాన పత్రిక అందేలా చూడాలని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అందజేయాలని అన్నారు.స్థానికంగా ఉన్న అన్ని పాఠశాలలు.కళాశాలల నుండి బస్సులను ఏర్పాటు చేసుకోవాలని సకుటుంబ సమేతంగా ఈ సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.బయట ఏర్పాటు చేసిన బ్యానర్లను 11వ తేదీవరకు తొలగించ వద్దని దానికి గాను స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని హొడిగ్స్ పై చేతులు వేస్తే సహించేది లేదని స్ట్రాంగ్ హెచ్చరికను జారీచేశారు.ఈ సన్నాహక సమావేశంలో మహిళా మోర్చా నాయకులూ.బీజేపీ సీనియర్ నాయకులు జిల్లా నాయకులు.కార్యకర్తలు మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# అందరికీ నాణ్యమైన విద్య, వైద్యమే లక్ష్యం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవల విస్తరణ
- మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక పథకాలు
- అందోల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలన్నదే లక్ష్యం
- సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా
- మంత్రి దామోదర్ రాజ నరసింహ



**జోగిపేట,మే 2, (సిరి న్యూస్):**

ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందేలా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో ట్రామా, ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాల వంటి పథకాలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు వంటి అవకాశాలను మహిళలకు కేటాయిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పడుతోందన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలో ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం, మౌలిక వసతులను అందిస్తున్నామని తెలిపారు. అందోల్ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటిస్తూ, ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. రూ.200 కోట్ల వ్యయంతో సింగూర్ లైన్ పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా విద్య, వైద్య రంగాల్లో సాధిస్తున్న అభివృద్ధిని వివరించగా, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్ శాఖ రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యమే కుటుంబానికి బలం

- రొమ్ము క్యాన్సర్ పై ముందస్తు పరీక్షలు అవసరం



**గుమ్మడిదల, మే 2 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం గ్రామంలో శనివారం రొమ్ము క్యాన్సర్ ఉచిత పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏఐజీ హాస్పిటల్, గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రాన్యూల్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్ హాజరయ్యారు. స్థానిక కౌన్సిలర్ షేక్ గౌసియా హుస్సేన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్. మధుకర్ పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 80 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహించారు. పరీక్షల నివేదికలను మూడు రోజులలో అందజేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని అన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి మహిళ తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో చైతన్యంతో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, మురళి, చక్రపాణి, విజయలక్ష్మి, సరెడ్డి గారి పద్మ, అభి శెట్టి రాజశేఖర్, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, మద్ది సోనీ రెడ్డి, ఆకుల మాధవి, పొన్నాల ప్రమీల, సూపర్వైజర్ లక్ష్మి, ఎంఎల్హెచ్‌పి భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు శశికళ, మణెమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, ఆశా కార్యకర్తలు కూడా పాల్గొని శిబిరం విజయవంతం చేశారు.

# రైతుల సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం

**ఆదిలాబాద్ (సిరి న్యూస్):** రైతుల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శనివారం ఆయనను భీంపూర్, గుడిహత్నూర్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీకాంత్ రెడ్డికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. భీంపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, గోన ఉపసర్పంచ్ ముశ్రాన్ హైమద్ తన అనుచరులతో కలిసి చైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యువతకు, రైతులకు ఈ నియామకం ఎంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. అలాగే గుడిహత్నూర్ మండల సీనియర్ నాయకులు దౌలత్ రావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం శ్రీకాంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తారన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రభుత్వానికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని, ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా పారదర్శకంగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక"ను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవనంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాలనలో పారదర్శకత కోసం దరఖాస్తుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో తాగునీరు, విద్యుత్, రహదారుల మరమ్మత్తులకు ప్రాధాన్యతనిస్తూ 99 రోజుల ప్రణాళికలో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయా లేదా అనేది తెలుసుకునేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించాలని సూచించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, "ప్రగతి పథం–సకలజన హితం– మన ప్రజా ప్రభుత్వం" అనే నినాదంతో ముందుకు సాగుతోందని అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామపంచాయతీల సర్పంచులకు సర్టిఫికెట్లు, లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, రైతులకు కూరగాయల కిట్లు పంపిణీ చేశారు. డ్రగ్స్ నిషేధ పోస్టర్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే ఆవిష్కరించి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ స్టాళ్లను పరిశీలించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, టీజీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, అదనపు ఎస్పీ సురేందర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.








# ప్రజా పాలన పథకాలు ప్రజలకు చేరువ కావాలి

**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన పథకాలు ప్రతిఒక్కరికీ చేరువ కావాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవనంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ఆమె కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశాలకు హాజరై వినడమే కాకుండా, సామాజిక బాధ్యతతో పథకాలను అమలు చేయాలని కోరారు. ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రాణ రక్షణే ముఖ్యమని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ శాఖల అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీజీఎస్సీపీసీఆర్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, అదనపు ఎస్పీ సురేందర్ రావు, సంక్షేమ శాఖాధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాపాలనతో అభివృద్ధి దిశగా ముందుకు

**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** ప్రజాపాలనతో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" అమలుపై శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజాపాలనలో అందిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం సహించబడదని హెచ్చరించారు. దరఖాస్తుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, రహదారుల మరమ్మత్తులకు ప్రాధాన్యతనిస్తూ పనులను వేగవంతం చేయాలని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకు గ్రామస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. "ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, టీజీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, అదనపు ఎస్పీ సురేందర్ రావు, సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ రావు, డీపీఓ రమేష్, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల(సిరి న్యూస్ ):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అమలు చేయాలని, విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్ రావు, మున్సిపల్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు అందించడంతో పాటు చౌకధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం నిల్వ కోసం గోదాముల సదుపాయం కల్పించడంతో పాటు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన వారికి బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. తాగునీరు, విద్యుత్, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.విద్య రంగ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఆరోగ్య రంగంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, సమస్యల శాశ్వత పరిష్కారానికి సమిష్టి కృషి అవసరమని అన్నారు. జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతా

- మీట్ ది ప్రెస్‌లో కవిత సంచలన వ్యాఖ్యలు
- "విద్య, వైద్యం ఉచితం కాకపోతే ప్రజలు ప్రశ్నించాలి"
- కేసీఆర్‌పై రాజకీయ విమర్శలే చేశానన్న స్పష్టీకరణ
- ప్రజల కోసం పోరాటమే లక్ష్యం

**హైదరాబాద్, మే 02 :**

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందకపోతే ప్రజలు గట్టిగా ప్రశ్నించాలని, అవసరమైతే తీవ్ర నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు.

పాంచజన్యంలో ప్రకటించిన ఐదు ప్రధాన అంశాలను అమలు చేయడంలో తాను ఇచ్చిన మాట తప్పితే తాను బాధ్యత వహిస్తానని కవిత స్పష్టం చేశారు. హామీలు ఇచ్చే ముందు ఆర్థిక నిపుణులతో చర్చించి సాధ్యాసాధ్యాలను అంచనా వేసిన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నానని చెప్పారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ప్రాధాన్యత కేటాయిస్తే ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించడం సాధ్యమేనని వివరించారు. రాష్ట్రంలో ప్రజలు తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని విద్య, వైద్యానికి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంకల్పం ఉంటే ఈ పరిస్థితిని మార్చవచ్చని, గతంలో ఆరోగ్యశ్రీ, ఉచిత భోజన పథకాలు కూడా మొదట విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ విజయవంతంగా అమలయ్యాయని గుర్తుచేశారు.

రాజకీయ విమర్శలపై స్పందిస్తూ, తన వ్యాఖ్యలు కేవలం రాజకీయ నేతగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై మాత్రమేనని, తండ్రిగా ఆయనతో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. సిద్ధాంతపరమైన భేదాల కారణంగానే విమర్శలు చేశానని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణలో లోపాల వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కవిత, ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే తల్లిలా ప్రజల కోసం పనిచేసే పాలన అందిస్తామని చెప్పారు. పార్టీ పేరుపై జరిగిన చర్చల గురించి మాట్లాడుతూ వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. పార్టీ స్థాపనలో అనేక సాంకేతిక, రాజకీయ అంశాలు ఉంటాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు చేసిన వారిని పట్టించుకోబోమని, ప్రజల కోసం ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.మహిళల సాధికారతపై ప్రత్యేకంగా మాట్లాడుతూ తమ పార్టీలో కనీసం 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామని ప్రకటించారు. మహిళలు పరిపాలనలో ముందుకు రావాలని, తమ పార్టీ ఇందుకు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ రాజకీయాలపై మాట్లాడుతూ డీలిమిటేషన్ వ్యవహారంలో రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, రాజ్యసభకు మరింత అధికారం కల్పించాలన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. అన్ని రాష్ట్రాలకు సమాన ఓటింగ్ హక్కులు ఉండాలని చెప్పారు. మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ ప్రధాన ప్రవాహంలోకి రావాలని, రాజకీయ పార్టీలలో చేరాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రక్షణ సేన వారికి స్వాగతం పలుకుతుందని తెలిపారు. ప్రజల మద్దతుపై విశ్వాసం వ్యక్తం చేసిన కవిత, కొత్త ఆలోచనలను ఈ నేల ఎప్పుడూ ఆదరిస్తుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, అభివృద్ధి, సామాజిక న్యాయం రెండు చక్రాల్లా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి దుర్భరం

- కోర్టు జోక్యంతో రిటైర్డు ఉద్యోగుల బకాయిలపై కదలిక
- రైతుల పరిస్థితీ దైన్యమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**రామాయంపేట, మే 2 :**



రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దుర్భరంగా మారిందని, నెల మొదటి తేదీకి జీతాలు అందకపోవడం, టీచర్లకు వేతనాలు ఆలస్యమవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. మెదక్‌జిల్లా రామాయంపేటలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. 2015 తర్వాత పీఆర్‌సీ బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ప్రయోజనాలు కూడా ఆలస్యంగా అందుతున్నాయని, నాలుగు వారాల్లోగా ఇవ్వాల్సిందేనని హైకోర్టు మొట్టికాయలు వేస్తే గాని ప్రభుత్వంలో చలనం రాలేదని అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులను కార్పొరేషన్ సిబ్బందిగా కాక ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదు.. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడవకూడదు అని హితవు పలికారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రజలు ఇప్పటికీ వాటి అమలుకు ఎదురు చూస్తున్నారన్నారు. ఇక రైతుల పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉందని, తాను స్వయంగా పలు వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించానని, అక్కడ ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి ఉండటం, వర్షాల వల్ల పంట నష్టపోవడం వంటి దృశ్యాలు కనిపించాయని చెప్పారు. సరైన సమయంలో లారీలు, ట్రక్కులు అందుబాటులో లేకపోవడం వల్ల ధాన్యం ఎత్తడం ఆలస్యమవుతోందన్నారు. కొన్నిచోట్ల రైస్ మిల్లర్లు, మధ్యవర్తులు, కొందరు అధికారులు కలిసి రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు రైతులు తమ పంటను అమ్ముకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మొక్కజొన్న రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి పంటలను కూడా ప్రభుత్వం ఎంఎస్‌పీ ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. కాబట్టి రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

**10న ప్రధాని రాష్ట్ర పర్యటన**

మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నరేంద్ర మోదీ తొలిసారిగా ఈనెల 10న రాష్ట్రానికి వస్తున్నారని, ఈ పర్యటన సందర్భంగా సుమారు రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని రామచందర్‌రావు తెలిపారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ సిటీ, వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్క్, పీఎం మిత్ర హ్యాండ్లూమ్ పార్క్ వంటి కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్నారన్నారు. అదేవిధంగా హఫీజ్‌పేట్, జోగులాంబ ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు, భవిష్యత్తులో వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, ఎయిర్‌పోర్టు వంటి మరిన్ని ప్రాజెక్టులను కూడా అమలులోకి తీసుకువస్తారని చెప్పారు.



# ఈ ఆహారాలతో మగతనానికి దెబ్బ

**ప్రస్తుత సమాజంలో పురుషులను మానసికంగా దెబ్బతీస్తున్న సమస్య ఇన్‌ఫెర్టిలిటీ. పెళ్ళి అయ్యి ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవడం మగవారి కలచివేస్తోంది. వైద్యుల వద్దకు వెళ్తే పురుషుల్లోనే లోపం ఉందని చెప్తున్న కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇందులో వైద్యులు అనేక కారణాలు చెప్తున్నారు. ఎక్కవసేపు కూర్చునే ఉండటం, అధిక ఒత్తిడి ఇలా మరెన్నో కారణాలు ఉన్నాయని, వాటిలో ఆహార అలవాట్లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్తున్నారు వైద్యులు. ప్రస్తుత పరుగుల ప్రపంచలో వందమందిలో 80శాతం మంది వరకు ఈ సమస్యతో సతమతమవుతున్నారని అంటున్నారు వైద్యులు. ఈ కారణంగానే అనేక దాంపత్య బంధాలు పెళ్లైన కొన్నాళ్లకే తెగిపోతున్నాయని చెప్తున్నారు. కాగా.. కొన్ని మార్గాల ద్వారా పురుషులు ఈ సమస్యల నుంచి బయటపడొచ్చని, తమ మగతన సమస్యను పరిష్కరించుకోవచ్చని సూచిస్తున్నారు వైద్యులు.**

సాధారణంగా మన తీసుకునే ఆహారం మన ఓవరాల్ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందులో మగతనం కూడా ఒకటి. మన ఆహారపు అలవాట్ల వల్లే అధికశాతం పరుషులు ఇన్‌ఫెర్టిలిటీ సమస్యకు గురవుతున్నారని అంటు న్నారు నిపుణులు. అయితే వారు తమ ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను దూ రంచేసుకోవచ్చని చెప్తున్నారు. ముఖ్యంగా చాలా మంది పురుషులు తెలియక ఇష్టంగా తినే ఆహారలే ఈ సమస్యకు దారితీస్తాయని, ఈ సమస్య నుంచి బయట పడాలంటే ఆ ఆహారాలను దూరంగా పెట్టడం తొలి స్టెప్ అని వివరిస్తున్నారు. ఇంతకీ ఆ ఆహారేలేంటో తెలుసా..

**సోడా, ఎనర్జీ డ్రింక్..**

పంచదార ఎక్కువగా ఉండే సోడా, ఎనర్జీ డ్రింక్స్ కూడా మేల్ ఫెర్టిలిటీని దెబ్బతీస్తాయి. ఈ ఎనర్జీ డ్రింక్స్ వీర్యం నాణ్యతని దెబ్బతీస్తాయి. ఇలాంటి ఎనర్జీ డ్రింక్స్ తీసుకున్నప్పుడు మగవారిలో స్పెర్మ్ కౌంట్ ప్రాబ్లమ్స్ వస్తాయి. కేవలం సంతాన సమస్యే కాదు.. వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరుగుతుంది. దీని వల్ల ఫెర్టిలిటీ సమస్య పెరుగుతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని పెంచుతుంది. అంతేకాకుండా, ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. దీంతో హెల్త్ ప్రాబ్లమ్స్ తగ్గుతాయి.

**సోయా ప్రోడక్ట్స్..**

సోయాతో తయారైన ఏ ప్రోడక్ట్స్ అయినా.. పాలు, టోఫు వంటి సోయా పదార్థాలన్నీ కూడా స్పెర్మ్ కౌంట్‌ని తగ్గిస్తాయి. సోయాలోని గుణాలు ఫెర్టిలిటీ అవకాశాలను తగ్గిస్తాయి. కాబట్టి, సోయా చంక్స్, పాలు, టోఫు వంటివాటిని అవాయిడ్ చేయడం మంచిది.

**ఎరువులతో పండించిన కూరగాయలు..**

మనం తినే పండ్లు, కూరగాయలు ఏవైనా సరే నేటి కాలంలో ఎక్కువగా ఎరువులతో పండిస్తున్నారు. అందుకే, వీటిని తినేటప్పుడు శుభ్రంగా కడగడం మంచిది. అదే ఎరువులు, కాలుష్యం కాలువల్లో కలుస్తుంది. వీటిలో పెరిగే చేపల్ని వండిగా తినడం, క్యాన్స్‌లో ప్యాక్ చేసి అమ్మితే వాటిని కొనుక్కుని వాటిని తినడం వల్ల కూడా ప్రమాదం ఉంటుంది. వీటిని తీసుకోవడం సెర్మ్ కౌంట్ తగ్గే అవకాశం ఉంది. కేవలం ఇవే కాదు.. మనకి తెలియకుండా చేసే కొన్ని పనులు కూడా ఈ సమస్యకి కారణమవుతాయి. అందులో నాన్ స్టిక్ కుక్ వేర్ వాడడం. ఇందులోని నాన్‌స్టిక్ పెస్టిసైడ్స్‌లానే పనిచేస్తుంది.

**ప్రాసెస్డ్ మీట్..**


రీసెంట్‌గా జరిగిన అధ్యయనాల ప్రకారం.. ప్రాసెస్డ్ మీట్స్ వంటి హాట్ డాగ్స్, బీఫ్ జర్కీ వంటి ప్రాసెస్డ్ మీట్ తినడానికి టేస్టీగా ఉన్నప్పటికీ వీటిని తీసుకోవడం వల్ల స్పెర్మ్ కౌంట్ తగ్గుతుంది. దీంతో పాటు పాటు ఇతర సమస్యలు కూడా వస్తాయి. ప్రాసెస్ చేసిన ఏ ఫుడ్స్ అయిన మగవారిలో వీర్యకణాల సంఖ్య తగ్గిస్తుంది. దీంతో సంతాన సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

**హై ఫ్యాట్ డెయిరీ ప్రోడక్ట్స్..**

ఫుల్ క్రీమ్ ఉన్న పాలు, అధిక కొవ్వు పాల ఉత్పత్తులు తీసుకోవడం వల్ల కూడా మగవారిలో సంతానోత్పత్తి తగ్గుతుంది. దీనికి కారణం స్పెర్మ్ కౌంట్ తగ్గడమే. అందుకే, పిల్లలకోసం ప్లాన్ చేసేవారు ఫుల్ క్రీమ్, జున్ను వంటివాటిని అవాయిడ్ చేయండి.

**శాచ్యురేటెడ్ ఫ్యాట్ ఫుడ్స్..**

శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఫుడ్స్ కూడా ఫెర్టిలిటీ అవకాశాలను తగ్గిస్తాయి. ఇవి ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ సాల్టీ, స్వీటెన్డ్ ఫుడ్స్, రెడ్ మీట్స్ వంటి వాటిలో ఉంటాయి. ఈ ఫుడ్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని, ఇన్‌ఫ్లమేషన్‌ని పెంచుతాయి. దీని వల్ల హెల్త్ ప్రాబ్లమ్స్, ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వంటి సమస్యలు వస్తాయి. ఈ మెటబాలిక్ డిసార్డర్స్ అన్నీ కూడా స్పెర్మ్ క్వాలిటీ తగ్గడం, హార్మోన్ ప్రాబ్లమ్స్, ఇమ్యునిటీని దెబ్బతీస్తాయి. దీంతో సంతానలేమి సమస్యలు పెరుగుతాయి.










## కరివేపాకుతో కమ్మని ఆరోగ్యం

# మీ సొంతం..

కరివేపాకుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. కరివేపాకులు ఎలా తీసుకున్నా మనకు మేలే చేస్తుంది. టీ కాసుకుని తాగినా సరే మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది కరివేపాకు. కానీ కరివేపాకు వల్ల ఉండే ఆరోగ్య ప్రయోజనాలేంటంటే పక్కాగా చెప్పడానికి చాలా మంది కష్టపడతారు. కరివేపాకులో యాంటీ కార్సినోజెనిక్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ డయామెటిక్, హిపటో ప్రొటెక్టివ్ అధికంగా ఉంటాయి. ఇవి అనేక వ్యాధుల నుంచి ఉపశమనం కల్పించడంతో పాటు మరెన్నో రోగాలు రాకుండా అడ్డుకుంటాయి కూడా. కరివేపాకు మన రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంతో పాటు గాయాలను త్వరగా నయం చేయడంలో కూడా కీలకంగా పనిచేస్తాయి. కరివేపాకును వంటలో వాడటం వల్ల వంటకం రుచితో పాటు మన ఆరోగ్యం కూడా పెరుగుతుందని వైద్య నిపుణులు చెప్తున్నారు.

కరివేపాకులో విటమిన్ సీ, ఏ, బీ, యాంటీ ఆక్సిడెంట్లు, ఐరన్, ఫాస్పరస్, ఐరన్, మెగ్నీషియం, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ వంటి మరెన్నో మంచి పోషకాలు కరివేపాకులో పుష్కలంగా ఉన్నాయి. కరివేపాకులో ఇన్ని పోషకాలు ఉన్నప్పటికీ వీటిని ప్రతిరోజూ మితంగానే తీసుకోవడం చాలా ముఖ్యం. లేనిపక్షంలో మన ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. మరి కరివేపాకుతో ఎలాంటి లాభాలు కలుగుతాయో చూద్దాం..మధుమేహం: ప్రతిరోజూ ఉదయం పూట 10 కరివేపాకు ఆకులను మెత్తగా నమిలి గోరువెచ్చని నీరు తాగాలి. ఇలా చేయడం వల్ల మధుమేహ సమస్యను సులభంగా నియంత్రించొచ్చు. దాంతో పాటుగా కరివేపాకు మన పేగు ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. విరేచనాలు, వాంతులను నియంత్రించడంలో కూడా కరివేపాకు అద్భుతంగా పనిచేస్తాయి.నోటి ఆరోగ్యం: నోటి దుర్వాసన సమస్య నుంచి కూడా కరివేపాకుతో ఉపశమనం లభిస్తుంది. రెండు నుంచి నాలుగు ఆకులను నమిలి తినడం ద్వారా, కరివేపాకు కషాయాలతో నోటిని పుక్కిలించడం ద్వారా మన నోటి వాసన మెరుగుపడుతుంది. ప్రతి రోజూ ఉదయం టీ స్పూనుడు కరివేపాకు రసం తాగడం ద్వారా అజీర్ణం, మలబద్దకం వంటి సమస్యలకు చెక్ చెప్పొచ్చని నిపుణులు చెప్తున్నారు.రక్తపోటుకు దివ్య ఔషధం: కరివేపాకులు రోజూ ఉదయాన్నే తీసుకోవడం ద్వారా మధుమేహంతో పాటు రక్తపోటు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక రక్తపోటుతో బాధపడే వారికి ఇది దివ్య ఔషధంలా పనిచేస్తుంది. ప్రతిరోజూ ఉదయాన్నే కరివేపాకులు ఎలా తీసుకున్నా రక్తపోటును నియంత్రించడం సులభతరం అవుతుందనేది నిపుణులు చెప్తున్నమాట.





The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.